# మాసిపోయిన వెలుగు

హోటల్ గదిలో స్వర్గం తలదాచుకుంది. వెన్నెలను గడ్డ కట్టించి సైజులవారీగా క్రోసి తయారుచేసినట్టు సోఫాలు, నేలనిండా ఎర్రగా కుంకుమ పూలను పరిచినట్లు మెత్తని మక్‌మల్ తివాచీ, గాజు కిటికీలు, జలతారు పరదాలు. తెల్లగా పాలవంటి కాంతిని వర్షించే లైట్లు—

గది నిండా నిశ్శబ్దం. నా ప్రక్క రంభను తన కాలిగోటిఅందంతో ఓడించగలిగే నా పి. ఎ. భారతి.

ఎదురుగా నన్ను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన ప్రముఖ పత్రికల విలేకర్లు (ఆడ విలేకర్లు కూడా)— వాళ్ళకూ నాకూ నడుమ నిశ్శబ్దంగా చెక్కిన ట్రాన్స్‌పరెంట్ మేఘంలా గాజు టేబుల్—టేబుల్‌పైన నాగరికంగా అమర్చిన గాజు ఫ్లవర్ వెజ్, ... కాస్ట్లీ కూల్ డ్రింక్స్—

గది నిండా గాలి హోటల్ వాళ్ళకు అమ్ముడుపోయి బలవంతంగా వెచ్చదనాన్ని విరజిమ్ముతోంది కొత్త ప్రియురాలి కౌగిలిలోలా—

పైన చెప్పిన ఏర్పాట్లన్నీ నేను డైరెక్ట్ చేయ బోయే సినిమా నిర్మాత అతి వినయంగా నాకోసం ఏర్పాటు చేసినవి. ఇంకా నేనేం కావాలన్నా— అంటే నేను హైదరాబాద్‌లో ఉండి. కలకత్తాలో ఉన్న చైనీస్ రెస్టారెంట్ నుండి ఫ్రాగ్ ఫ్రై తెప్పించు— అని గమక నేనంటే 'యస్సర్' అని తప్పకుండా తెప్పించేందుకు అదే హోటల్‌లో. ఎర్-కండిషన్ కాని గదిలో నానిర్మాత నా నుంచి ఏక్షణాన్నయినా వెలువడే ఆజ్ఞల కోసం చిత్తశుద్ధితో వేచి ఉన్నాడు.

సినిమా ఫీల్డ్‌లో నేను చెప్పింది వేదం! చేసింది కళాఖండం. మాట్లాడింది ప్రతి సన్మానానికి శిరోధార్యం.

నా సినిమాలంటే జనంలో వెర్రి ఉప్పెనలా ఉవ్వెత్తున లేస్తుంది. నిర్మాతలకు నేను కామధేనువును.

అవార్డులు నన్ను వెతుక్కుంటూ వస్తుంటాయి. సినిమాల్లో కొత్తదనాన్నీ. ప్రయోగాలనూ, విలక్షణతనీ సృష్టించ గలిగే ఏకైక డైరెక్టర్ ఎవడు ఫీల్డ్‌లో అంటే నే...నే! నేను వేసే ప్రతి అడుగులో. చేసే ప్రతి పనిలో ఏదో కొత్తదనం ఉంటుందని జనం ఒళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తూంటారు ఆశతో.

'మనం అనుభవిస్తుంది ఎంత ఉదాత్తమైన దైనా, అపూర్వమైనదైనా, అపురూపమైనదైనా, మనిషి తప్పకుండా ఆ అనుభవంతో మొహంమొత్తి మళ్ళీ ఒక కొత్త అనుభవం కోసం, వెరైటీకోసం తహతహలాడుతాడు. మార్పు కోసం, తపిస్తాడు. మార్పే మనిషి జీవితానికి ఆలంబన—' ఇదీ నా వర్కింగ్ ప్రిన్స్‌పుల్....కార్య సిద్ధాంతం. ఈ సిద్ధాంతమే నన్నూ, పేరునూ ఆకాశమండలం పైకి, అత్యున్నత శిఖరాల మీదకి లాక్కుపోయింది.

ఇప్పుడు నా గదిలో జరుగుతున్నది నిన్న ద్విశత దినోత్సవం జరుపుకున్న నా చిత్రం 'సీటీబుడగ' తరవాత ప్రస్తుతం నేను తీయాలనుకుంటున్న సినిమా గూర్చి పత్రికవాళ్ళు నా పేరు చెప్పుకుని పత్రికల నమ్ముకునేందుకు ప్రాధేయపడి ఏర్పాటు చేసుకున్న పబ్బం. దీని పేరు పాత్రికేయులగోష్ఠి.

గంభీరంగా పైప్ వెలిగించుకుని...కుర్చీలోనుంచి లేచి నిలబడి మై.... సర్దుకుంటూ....బయటికి రోడ్డు దిక్కు చూచేందుకు అనుకూలంగా

ఉన్న గాజు తలుపులను జరుపుతూ ... అక్కడే నిలబడి "వెల్... ప్రొసీడ్" అన్నాను.

విలేకరులు ఆన్ చేసిన బల్బుల్లా చురుకు దనాన్ని పులుముకున్నారు.

"మీరు ప్రస్తుతం ఎన్ని సినిమాలను డైరెక్ట్ చేస్తున్నారు?" అని అడిగింది ఒక ఆడ విలేకరి.

"భారతీ" అన్నాను నా పి. ఎ. ను. ఆమె గబగబా ఏడు సినిమాల పేర్లు చదివి "సెవెన్" అంది.

బయట రోడ్డు దిక్కు చూస్తున్న నాకు ఒక దృశ్యం కనబడింది. ఎండిపోయిన చెట్టు కింద ఒక అందమైన యువతి ... చిరిగిన బట్టలు కట్టుకుని నాట్యం లాంటిది చేస్తోంది. అక్కడే ఆమె తాలూకు మనుషులు పదిమంది దాకా కూర్చుని ఏవో నాటు వాద్యాలను వాయిస్తున్నారు. చుట్టూ జనం చేరి ఆమె నాట్యానీ ఆమె ఒంటినీ,ఒంపుసొంపులనూ చూస్తున్నారు.

నాటు నృత్యం.... నాటు మనుషులు... నాటు కళ.

ఆమె నాటు మనిషి.

'భారతీ'! 'ఎస్సర్.' 'బైనాక్స్.' క్షణంలో ఆమె బైనాక్యులర్ నందించింది నా చేతికి.

చూస్తున్నాను రోడ్డు దిక్కు...అగుంపుదిక్కు...ఆమెదిక్కూ.... ఆమె నాట్యం దిక్కు.

ఆ ఒళ్ళు....ఆ కళ్ళు—ఓహ్. ఆమె...ఆమె-

"మీరు మీ తదుపరి చిత్రాన్నెప్పుడు ప్రారంభిస్తున్నారు?" ప్రశ్న

"జనవరిలో" — అటే చూస్తున్నాను

1311



"సాధారణంగా మీ ప్రతి చిత్రంలోనూ ఒక ప్రత్యేకతను ప్రదర్శిస్తుంటారు గదా మీరు ఈసారి .... ఈ మీ కొత్త చిత్రంలో ఎటువంటి కొత్తదనాన్ని ప్రవేశ పెట్టాలనుకుంటున్నారు?"

ఆమె...ఆమె శరీర పరిపుష్టత .... అంగ సౌష్టవం – ఒక నాటు కళాకారిణి– ఒక స్ట్రీట్ డాన్సర్– ఓ దిక్కూ మొక్కూ లేని అనామకు రాలు ఈమెను తదుపరి చిత్రంలో హీరోయిన్‌గా వేయిస్తే....

పబ్లిసిటి...పబ్లిసిటి ఒక కొత్త తరహా పబ్లిసిటి

చలనచిత్ర చరిత్రలో ఒకకొత్త ప్రయోగం...ఓ వినూతనమైన మలుపు. ఒక వీధిలో నాట్యమాడే అనాథ స్త్రీని అపురూప కళాకారిణిగా మార్చిన ఘనుడు–'అతని చేతిలో శిలలే శిల్పాలై...'–అని నానా రకాలుగా....

పత్రికలన్నీ అరుస్తాయి ... మొత్తుకుంటాయి. ఈ వార్త ప్రెస్సుల నోళ్ళలోనుండి జనం నోళ్ళ....పైకి ప్రవహించి___ఈ తన పని ఒక న్యూవేవ్... ఒక సరికొత్త ఆవిష్కరణ. తను ఒక ప్రయోక్తగా మిగిలిపోతాడు.

'నేను తలుచుకుంటే ఒక బిచ్చపుదాన్ని బట్ట లొలిపించి చీకటి వెలుగుల్లో ఉరికించి సెక్స్ బాంబ్ షెల్‌ను చేయగలను. చేయదలచు కుంటే ఒక అందాల నటిని కావాలని స్క్రీన్ మీద ఫేల్ చేయించి డిఫేమ్ చేయగలను.

విలేకరి మళ్ళీ అడుగుతున్నాడు "మీ ప్రస్తుత సినిమాలోని ప్రత్యేకతేమిటని___"

"డైమండ్___వజ్రం కూడా ఒక బొగ్గే కదా...." అన్నాను విలేకరి దిక్కు తిరిగి బైనాక్యులర్‌ను పి.ఎ. కిస్తూ !

ఆ నా అసందర్భపు వ్యాఖ్యకు వాళ్ళు ఉలిక్కిపడ్డారు. "అవును" అన్నారెవరో.

"అంటే భూమిలోనుండి లభించే ఒకానొక రకమైన బొగ్గును చూచి అది వజ్రమని తెలుసుకొనగలిగిన తెలివీ, నిపుణతా అందరికీ ఉండవు...అవునా." "అవును"

"తెలుసుకోగలిగిన వాడు తెలుసుకోలేని వానికన్నా గొప్పవాడు అవునా?" "అంతేగదండి"

"ఇంతకు నే నిదంతా ఎందుకు చెబుతున్నానో మీకర్థం కావడం లేదనుకుంటాను బహుశా." "అవును"

"మీరంతా ఇటురండీ ఓసారి" అని పిలిచాను నా దగ్గరికి వచ్చారు అందరూ. "ఆ డాన్సేసే అమ్మాయిని చూడండి." చూస్తున్నారు. "ఆమే నా నెక్స్ట్ పిక్చర్‌లో హీరోయిన్." అందరూ ఉలిక్కిపడి చూశారు వెధవల్లా ... లేక నేనే వెధవలా మాట్లాడుతున్నాననుకున్నారో మరి.

"రియల్లీ" అన్న దొకామె.

"ఎస్ — అని గంభీరంగా పైప్‌ను ఒక దమ్ములాగి "భారతీ! కాల్ దట్ గర్ల్"—అన్నాను పి.ఎ.తో. ఆమె కూడా ఆశ్చర్యంలో నుంచి తేరుకోలేదు.

విలేకరులు వ్రాసుకుంటున్నారు ఏమిటో—

భారతి బయటికి వెళ్ళింది బాయ్‌ను పంపించేందుకు. గదినిండా నిశ్శబ్దం—ఆశ్చర్యం.

"మీరు మీ మీ సినిమా పత్రికల్లో శిలను శిల్పంగా మార్చుతున్న ప్రముఖ దర్శకుడు శ్రీ మాధవ—అన్న అర్థమొచ్చేట్టు ప్రచురిస్తే బాగుంటుందనుకుంటాను" అన్నాను.

"అంతకంటే అర్థవంతంగా పబ్లిసిటీ ఇస్తాం, సార్."

"థాంక్యూ—" ఇస్తారు...ఇవ్వక చస్తారా.... ఆ విషయం నాకు తెలుసు.

విలేకరులు గుసగుస పెట్టుకుంటున్నారు...నిజంగా ఈయన గమ్మత్తయిన మనిషేరా లేకుంటే ఒక బిచ్చపు గత్తెలాంటి దాన్ని సినిమాలో....గాజుముక్కను వజ్రం చేస్తున్నాడు— అని అనుకుంటున్న ట్లున్నారు.

నిశ్శబ్దంగా అంతా గమనిస్తూ బయటికి చూస్తున్నాను. మా మధ్య 'కల్చర్' మవునంగా నిరీక్షిస్తూంది. ఒకటి... రెండు... మూడు నిము షాలు గడుస్తున్నాయి.

బయట... తెల్లబట్టల్లో ఉన్న బాయ్ ఆమె దగ్గరకు వెళ్ళడం.... ఆమె డాన్స్ ఆపడం...అతను ఆమెతో మాట్లాడుతు....వెంటనే ఆమె తన వాళ్ళతో ఏదో గుసగుసపెడుతూ—గమనిస్తున్నాను గర్వంగా.

ఇంకో రెండు నిముషాల్లో ఆమే....ఆమె వెంట ఒక ముసలోడూ బయలుదేరి—గది తలుపులు తెరుచుకుని వచ్చారు లోపలికి ఆమె, అతనూ. బాయ్ రాలేదు.

భారతి అడిగింది "నీ పేరు" అని. "జయంతి" అంది చురు కుగా. మనిషిలో బెరుకు గానీ, భయంగానీ ఏమీ లేవు.

"ఈయన మాధవగారు...సిన్మా డైరెక్టర్."

"నమస్కారమండీ" అంది. ఆమె అంత సంస్కారవంతంగా ఉంటుందని నే నూహించలేదు.

ఇక నేనే మాట్లాడాను—"నేను నిన్ను నా సినిమాలో హీరో యిన్‌గా తీసుకుందామనుకుంటున్నాను" అని.

ఆమె మాట్లాడలేదు. నా గదిలో ఉన్న మనుషులందరి దిక్కూ శూన్యంగా చూచింది. ఆమె వెంట ఉన్న ముసలాయన ఆమె దిక్కూ భయం భయంగా, నిస్పృహాయంగా చూస్తున్నాడు.

"ఏమంటావ్" అన్నాను. ఆమె ముసలాయన వంక చూచింది. ఇప్పు డామె ముఖంలో భావాలు ఉప్పెనలా పొంగడం స్పష్టంగా కనిపించింది నాకు.

ఏమీ మాట్లాడలేదు. మళ్ళీ అడిగాను... ఆశ్చర్యమేమిటంటే, నేను.... ఇంత హఠాత్తుగా స్వయంగా అడిగితే సింహమైనా కుక్కలా నడుస్తుంది నా దగ్గర.... అటువంటిది ఈమె తటపటాయించడమేమిటి?

"మీరు ఒకసారి మా ఇంటి కొస్తే... అక్కడ మాట్లాడు కుందాం" అంది. నేను వాళ్ళింటికా....? ఎందుకు,.. ఎందుకు— అసలు వాళ్ళకు ఇల్లంటూ ఒకటుందా.

"అలాగే" అన్నాను హుందా కోసం. మరుక్షణం బయలుదేరాం అందరం నాలుగు కార్లలో.

ఆమె చెప్పినట్లు కార్లు నడిచీ నడిచీ ఒక సత్రాన్ని చేరుకున్నాయి. ఆ సత్రం చీకటి చీకటిగా ఉంది. గలీజుగా ఉంది... రొచ్చుగా ఉంది. మనుషులు ఉండేట్లుగా మాత్రం లేదు.

ఆ సత్రంలో—ఒక గదిలో.... వెలుగు జబ్బుపడి...పలుచగా....

మాసిపోయి, మరకలు మరకలుగా పడుతూంది. ఏదో గమ్మత్తయిన తడివాసన... ముక్కవాసన వేస్తూందక్కడ.

ఆ వాసనలో.... ఆ మసక వెలుతురులో—నేల మీద పడుకుని ఉన్న ఒక స్త్రీ...మమ్మల్ని చూచి నెమ్మదిగా లేచి... తలుపులు తెరవగానె ముంచుకొచ్చిన గుడ్డి వెలుగు ఆమె ముఖంపై పడి— ఆమెను ఎక్కడో చూశాను నేను...

కాని, ఎక్కడ....ఎక్కడ.... ఊహూ... జ్ఞాపకం రావడం లేదు—

"ఈమె మా అక్క—సుందరి" అంది జయ.

"........." మాట్లాడలేదు నేను. విశ్శబ్దంగా చూస్తూ జ్ఞాపకాలను తిరగేసుకుంటున్నాను...సుందరి,...సుందరి ఎక్కడో విన్నా నా పేరు.

"ఈమె ఎనిమిదేండ్ల క్రితం 'మీఆట బొమ్మ' సినిమాలో నటించింది. ఆ సినిమాకు అవార్డొచ్చింది. మీకూ భలే పేరొచ్చింది. మీరు మీ దారిలో వెళ్ళిపోయారు వెలుగులోకి. మీ కోరికపై సినిమాల్లో చేరి....తారననిపించుకుని...ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి—మరుక్షణం చిచ్చుబుడ్డిలా చీకట్లో మిగిలిపోయింది. ఒక స్థాయికి చేరి.... ఆ మెట్టు నుండి కిందికి దిగి రాలేక....అక్కడే ఉండే వీలులేక, జనంలో ఒకప్పుడు రంగు పులుముకున్న ముఖమెత్తుకుని తిరగలేక—మళ్ళీ సినిమా చాన్సులు రాక చావకా బ్రతకలేకా ఒక గమ్మత్తయిన, అజ్ఞాతమైన బ్రతుకును గడుపుతోందక్క—అదీ నా మీద ఆధారపడి. సముద్రం లోకి దిగేప్పుడే మనిషి ఆలోచించుకోవాలి తను ఈదుతూ పోగలడా, ఓడపై ఎక్కి పోగలడా అని. ఈదుకుంటూ సముద్రాన్ని దాటగలనని

ధైర్యం చేసే వ్యక్తిని అభినందించలేను నేను. అందుకనే నేను మా అక్కలా మరో సుందరిని కాదల్చుకోలేదు—"

వింటున్నాను విశ్శబ్దంగా.

నా మెదడును చీమలు కొరుకుతున్నట్టుగా ఉంది.

కథా నిలయం
శ్రీకాకుళం